క్లుప్తంగా

30శాతం మధ్యంతర భృతి చెల్లించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30శాతం చెల్లించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి కోరారు.బుధవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ నియమించడం ఆలస్యమవుతున్నందున 30శాతం మధ్యతంతర భృతి ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం ప్రకటించాలని,ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కలీముల్లా, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, సురేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, రాఘవేంద్ర, చెన్నుడు, సుభాన్, విశ్వనాథయ్య పాల్గొన్నారు.

పచ్చర్ల ఐటీడీఓలో చేరిక

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల ఐటీడీఏలో చేరిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం పచ్చర్లలో జరిగిన కార్యక్రమంలో గిరిజనులకు ఐటీడీఏ చేరిక పత్రంను గిరిజనులకు అందచేశారు. ఆమె మాట్లాడుతూ దశాబ్దాల చెంచుల కోరిక నెరవేరిందని ఆమె అన్నారు. చెంచుల కోరిక మేరకు అంతర్గత సిమెంట్ రోడ్లు, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీడీ వెంకట శివప్రసాదు, ఎంపీడీఓ శివమల్లేరప్ప, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ నాయకులు జంబన్న, మహేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి షబ్బీర్ ఉసేన్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సీజన్‌లో ప్రజలు అప్రమత్తమంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, అలాంటి ప్రదేశాలలో వేస్టుఆయిల్ చల్లాలని తెలిపారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్య చికిత్సలు చేయించుకోవాలని చెప్పారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ వర్కర్ నూర్జహాన్

నంద్యాల(న్యూటౌన్): గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఇలాంటి సమస్యలు ఏవైనా ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలని మహిళలు, విద్యార్థినులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, ఐసీడీఎస్ వర్కర్ నూర్జహాన్ సూచించారు. బాధిత మహిళలకు అండగా నిలబడి అవసరమైన సహకారం అందించేందుకు వన్ స్టాప్ సెంటర్ ఉందన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సఖీ వన్‌స్టాప్ సెంటర్, మహిళా సాధికారత విభాగం సంయుక్తంగా విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గృహహింస, లైంగిక వేధింపులు, భ్రూణహత్యలు, అబార్షన్, తదితర ఏవైనా జరిగితే ఈ సెంటర్ నందు సహాయ సహకారాలు అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్వేత, జయలక్ష్మి, అధ్యాపకులు పార్వతీ, కుసుమ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని బి. నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద బుధవారం రాత్రి మోటర్ సైకిల్‌పై నుంచి కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నకంబలూరు గ్రామానికి చెందిన చెన్నకేశవ రుద్రవరంలో వ్యక్తిగత పనులు పూర్తి చేసుకొని మోటర్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్దకు చేరుకోగానే మోటర్ సైకిల్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

8న హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈ నెల 8న జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ మినీ అండర్-12 బాలబాలికల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి.సువర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 - 15 మధ్య జన్మించిన బాల బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

ప్రతి ఇంటికి సురక్షిత నీరు

- జల్ జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా సురక్షిత నీరు సరఫరా చేయడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. జిల్లాలో ఈపథకానికి సంబంధించిన పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం రాజధాని ఢిల్లీ నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ (డీడీ డబ్ల్యూఎస్) సెక్రటరీ సుమిత్‌జా ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లతో జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లాలో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు తదితరులతో కలెక్టర్ తన కాన్ఫరెన్స్ హాల్లో నుంచి మాట్లాడారు. జిల్లాలోని ఆత్మకూరు, బండి ఆత్మకూరు, రుద్రవరం తదితర మండలాల ఎస్టీ కాలనీలలో నీటి సరఫరాకు సంబంధించి 31 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను గుర్తించాలన్నారు. అలాగే ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలన్నారు. ఇళ్లకు నీటి సరఫరా చేసే పైపులైన్లు ఎక్కడ కూడా లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల అమలు పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా తాగునీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామ పంచాయతీల్లో క్లోరినేషన్ సిస్టం పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

జిల్లాకు 9,300 మెట్రిక్ టన్నుల యూరియా రాక

జిల్లాకు 9,300 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఈనెల 4న 2600 మెట్రిక్ టన్నులు, ఈనెల 5న 2600 మెట్రిక్ టన్నులు, ఈనెల 13న 1500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం రైతులకు యూరియా అవసరాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చూస్తామన్నారు. ఎరువులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పది రోజుల్లో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని చెప్పారు. జిల్లాలో రైతులు రెండు పంటలు సాగు చేయడంతోనే యూరియా వాడకం పెరిగిందన్నారు. ఎరువులు అక్రమంగా తరలిపోకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. యూరియా కోసం రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ యూరియా పంపిణీపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పలు శాఖల సమన్వయంతో యూరియా పంపిణీ సక్రమంగా జరిగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్ ఉన్నారు.

పొలాల రస్తా ఏర్పాటు చేస్తాం



గోవిందపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ విశ్వనాథ్

ఉయ్యాలవాడ : రైతులు పొలాలకు వెళ్లేందుకు రస్తా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోవిందపల్లె గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూపనగుడి, మాయలూరు, గోవిందపల్లె గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు సర్వే నంబర్ 356, 397, 405లో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకునేందుకు కొందరు రైతులు అంగీకారంతోనే పొలాలు ఇచ్చారు. అయితే కొందరు రైతులు తమ పొలాలను ఇవ్వలేదు. సొంత పొలాలు కలిగిన రైతులకు పొలాల్లోకి వెళ్లేందుకు రస్తా మార్గం లేదు. ప్లాంటు ఏర్పాటు పనులు జరుగుతుండడంతో రస్తా సోలార్‌లో విలీనమైందని కొందరు రైతులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణకు వచ్చిన ఆర్‌డీఓ గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. సొంత పొలాలు కలిగిన రైతులందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి 40 అడుగుల వెడల్పుతో పొలాలకు వెళ్లేందుకు రస్తా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ సువర్ణాదేవి, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ వితరణ



బాలికల ఉన్నత పాఠశాలకు ప్రింటర్ అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చాగలమర్రి: మండలకేంద్రం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ ఓరియంటల్ బాలికోన్నత పాఠశాలకు రూ.14,500 విలువ చేసే ప్రింటర్, గోడిగనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.14,000 విలువ చేసే 20 కుర్చీలను పీఆర్‌టీయూ నాయకులు వితరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిలర్ నారాయణమూర్తి మాట్లాడుతూ ఒక వైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మరోవైపు పాఠశాలల్లో విద్యార్థుల మౌళిక సదుపాయాల కల్పనకు పీఆర్‌టీయూ ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీవయ్య, పీఆర్‌టీయూ నాయకులు రవిప్రకాష్ రెడ్డి, మహేంద్ర, దస్తగిరి, శివరామచంద్రన్, శివరామకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మయ్య తదితరులున్నారు.


10,411 క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం ఉల్లి క్వింటాలుకు ప్రకటించిన రూ.1200 మద్దతు ధర లభించాలంటే పొలంలోనే గ్రేడింగ్ చేసుకొని నాణ్యతతో మార్కెట్‌కు తీసుకురావాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి సూచించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన ఉల్లి దిగుబడులకు వ్యాపారులు టెండర్ ద్వారా రేటు కోట్ చేస్తారని, రూ.1200 కంటే ఎక్కువ ధర వచ్చిన లాట్లను వ్యాపారులే తీసుకుంటారని చెప్పారు. అంతకంటే తక్కువ ధర లభించిన లాట్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని వివరించారు. బుధవారం 5,489 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లతో కలుపుకుని, ఇప్పటివరకు 10,411 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుకు ఉల్లి తెచ్చే రైతులు విధిగా ఈ-క్రాప్ బుకింగ్ ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నకళ్లు తీసుకురావాలని పేర్కొన్నారు.

రేషన్ షాపుల్లో ఉల్లి విక్రయం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని రేషన్ షాపుల్లో గురువారం నుంచి ఉల్లిని అందుబాటులో ఉంచినట్లు డీఎస్‌ఓ ఎం.రాజారఘువీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కిలో రూ.14 ప్రకారం ఉల్లిని కార్డుదారులు పొందవచ్చన్నారు.

7న మద్దిలేటి స్వామి ఆలయం మూసివేత



మద్దిలేటి నరసింహస్వామి ఆలయం వ్యూ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని ఈ నెల 7వ తేదీ ఆదివారం చంద్ర గ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేయనున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు బుధవారం తెలిపారు. మళ్లీ సోమవారం తెల్లవారు జామున 4:30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి స్వామి, అమ్మవార్ల ఆలయ సంప్రోక్షణ, పుణ్యాహవాచనం, అభిషేకాలు నిర్వహించి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. భక్తులు గమనించాలని సూచించారు.

యాగంటి ఆలయానికి రూ.23.40 లక్షల ఆదాయం



వేలాలు నిర్వహిస్తున్న ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రం శ్రీ ఉమామహే శ్వరస్వామి ఆలయం ఆవరణలో పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా ఆలయానికి రూ.23,40,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. ఇందులో టెంకాయలు విక్రయించుకునే హక్కును పాతపాడు గ్రామానికి చెందిన యాగంటి రూ.13.40లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును యాగంటిపల్లెకు చెందిన మద్దిలేటి రూ.3.05 లక్షలు, బొమ్మలు, పండ్లు విక్రయించుకునే హక్కును మీరాపురం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి రూ.4.20లక్షలు, సామాన్లు భద్రపరచుకునే హక్కును కటికవానికుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు రూ.2.75లక్షలకు పాడి దక్కించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళిశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేష్ బాబు, ఆలయ అర్చకులు మహేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

శిరివెళ్ల: యూరియాపై ఆందోళన చెందవద్దని ఏఓ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4,5,10 తేదీల్లో నంద్యాల జిల్లాకు 2600 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా అవుతుందన్నారు. అలాగే 13న 1500 మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు. ఇందులో 6,500 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలోని సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తుందని వెల్లడించారు.

కరాటేలో ప్రతిభ



సాయిచరణ్ తేజను అభినందిస్తున్న ఎస్‌వీఆర్ కళాశాల యాజమాన్యం

నంద్యాల(అర్బన్): గత నెల ఆగస్టు 25 నుంచి 27 తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డిప్లొమ విద్యార్థి సాయి చరణ్ ప్రతిభ కనబర్చారు. ఈ నేపథ్యంలో ఆ కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎండీ దినేష్‌రెడ్డి విద్యార్థిని అభినందించి మాట్లాడారు. సాయితేజ విజయం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, డిప్లొమ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వచ్చేనెల 12న సామూహిక వివాహాలు

నంద్యాల(వ్యవసాయం): అంజుమన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12వ తేదీ పేద ముస్లింలకు సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ కుద్దూస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వధువుకు 18 ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండిన వారు అర్హులన్నారు. వివాహం తర్వాత ప్రతి వధువుకు రూ. 50 వేలు అందజేస్తామన్నారు. నంద్యాల పట్టణానికి చెందిన పేద ముస్లింలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు స్థానిక అంజుమన్ షాదీఖానలో సంప్రదించాలని సూచించారు.

జ్యోతిర్లింగ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

శ్రీశైలంటెంపుల్: భారతదేశంలోని 12 ప్రసిద్ధ జ్యోతిర్లింగాలను కలిపి ప్రత్యేక జ్యోతిర్లింగ బోర్డును ఏర్పా టు చేయాలని జ్యోతిర్లింగ బోర్డు బనావో అభియాన్ సమితి జాతీయ సమన్వయకర్త, సుప్రీంకోర్టు న్యాయవాది అనిల్‌కుమార్ గుప్తా డిమాండ్ చేశారు. బుధవారం శ్రీశైలం చేరుకున్న ఆయన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్‌గుప్తా మీడియా మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఉన్న 11 జ్యోతిర్లింగాలను సందర్శించానని, ప్రస్తుత శ్రీశైల మల్లికార్జున స్వామివారి దర్శనంతో 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తి అయిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు, 12 జ్యోతిర్లింగాలు ఉన్న ప్రాంతాల లోక్‌సభ సభ్యులకు కూడా లేఖల ద్వారా జ్యోతిర్లింగ బోర్డు ఏర్పాటు చేయాలని వివరించానన్నారు. జ్యోతిర్లింగ బోర్డు ఏర్పాటైతే 12 జ్యోతిర్లింగాల వద్ద రోడ్డు, రైల్వే, వైమానిక సౌకర్యాలు మెరుగుపడి, యాత్రికులకు ప్రయాణి సులభంగా ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న అనిల్ కుమార్ గుప్తా

కేంద్రీయ విద్యాలయంలో వసతులు కల్పిస్తాం

డోన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ప్రారంభమవుతున్న కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఆయన బుధవారం కేంద్రీయ విద్యాలయాన్ని ప్రిన్సిపాల్ మాలిక్, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాలయం ఆవరణ నుంచి రైతుమిత్ర కాలనీ వైపు గేటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లాంటి మౌలిక వసతులు ఇప్పటికే కల్పించామన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి ఎలాంటి సహాయం చేయడానికైనా మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి

- బాలల సంరక్షణ కేంద్రాలపై జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ సమావేశంలో జేసీ



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడంపై దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం బాలల సంరక్షణ కేంద్రాలపై జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల్లో విద్యకు, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే బాలల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సౌకర్యాల కల్పనపై ప్రతి మూడు నెలలకోసారి జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ తనిఖీలు చేసి తనకు నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని లీలావతి దేవి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం నాలుగు బాలల సంరక్షణ కేంద్రాలు బాలల న్యాయ చట్టం కింద నిర్వహించబడుతున్నాయన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని జేసీ విష్ణుచరణ్ ఆదేశించారు. పోషకాహార కార్యక్రమంపై బుధవారం జిల్లా ఐసీడీఎస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యతపై మండల స్థాయి కమిటీలు దృష్టి సారించి నాణ్యతపై నివేదికలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జుబేదా, సంజీవరెడ్డి, స్వప్న ప్రియదర్శిని, జిల్లా బాలల సంరక్షణ అధికారిని, మెడికల్ ఆఫీసర్, సైకియాట్రిస్ట్, స్వచ్ఛంద సంస్థలు, జిల్లా పౌరసరఫరా అధికారి, జిల్లా మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా వైద్య శాఖాధికారి, వీడీపీవోలు, సరఫరాదారులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నాయకులను బెదిరిస్తే పుట్టగతులుండవు

- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బేషరతుగా క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సంఘాల నాయకులను బెదిరిస్తే పుట్టగతులుండవని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను హెచ్చరించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతాపల్లి గ్రామంలో సోలార్ పరిశ్రమకు సేకరించిన భూములను పరిశీలించడానికి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే ఇష్టమొచ్చినట్లు అసభ్యపదజాలంతో దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. నిత్యం రైతు సమస్యలపై పోరాడే వ్యక్తుల పట్ల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు సిగ్గు చేటు అన్నారు. వెంటనే రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డికి గుమ్మనూరు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోలార్ యాజమాన్యానికి ఎమ్మెల్యే తొత్తుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ప్రజలు తరిమి కొడతారు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడే తీరు మార్చుకోకపోతే ప్రజలు ఆయనకు తరిమికొడతారని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు పుల్లా నరసింహులు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఎం నేత ప్రభాకర్‌రెడ్డిని గుమ్మనూరు దుర్భాషలాడటాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఎమ్మెల్యేగా పదవిలో కొనసాగే నైతిక హక్కు గుమ్మనూరుకు లేదని, కూటమి సర్కారు వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు సురేష్, రమణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ పంటల సాగుతో లాభాలు



ఇంజేడులో రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రధాన పంటలకు అనుసంధానంగా అంతర్ పంటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఇంజేడు, కాకరవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన మిరప, కంది తదితర ప్రధాన పంటల్లో చిరు ధాన్యాలైన కొర్ర, సజ్జలాంటి పంటలు వేస్తే చీడపీడలను నివారించవచ్చన్నారు. తక్కువ కాల వ్యవధిలో పంట దిగుబడులు పొందవచ్చునన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మల్లేవేముల..మొక్కజొన్న పంట పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగనేతాజి

ఎరువుల వినియోగంపై అవగాహన

చాగలమర్రి: మండలంలోని మల్లేవేముల గ్రామంలో బుధవారం ఏఓ రంగనేతాజి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మొక్కజొన్న, వరి, మినుము పంటల్లో పాటించవలసిన ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. అధిక ఎరువుల వాడకం వలన భూమి చౌడు నేలగా మారి పోయి సారవంతం తగ్గిపోతుందన్నారు. ఫలితంగా దిగుబడులు తగ్గుతాయన్నారు. ఎప్పుడూ రసాయనిక ఎరువులు మాత్రమే వినియోగించకుండా సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా పశుల పేడ, పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామ సమీపంలో రియలన్స్ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న బైకును వెనుక వస్తున్న లారీ ఢీకొనడంతో శ్రీరాములు, విష్ణువర్ధన్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. వివరాలు.. ప్యాపిలి మండలం పెద్దపూదిళ్ల గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నపూజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరైన లక్ష్మీ ప్రసాద్ భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకవచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బంధువు శ్రీరాములు స్నేహితుడు విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి బైకుపై డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి భౌతిక కాయాన్ని సందర్శించి తిరిగి వెళుతుండగా లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో రోడ్డుపై పడ్డారు. ఈ సమయంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును డ్రైవర్ చాకచక్యంగా అదుపుచేయడంతో మరో ఘోర ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి...

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సంజామల మండలం ఆకుమల్లకు చెందిన రమణారెడ్డి పని నిమిత్తం బైక్‌లో తల్లితో పాటు బనగానపల్లెకు బయలుదేరాడు. పోలీస్ స్టేషన్ దాటాక ఎదురుగా వస్తున్న మినీ వాహనం ఢీకొనడంతో ఇద్దరూ కింద పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు,పోలీసుల సహకారంతో క్షతగాత్రులను చికిత్స కోసం నంద్యాలకు తరలించారు.

ఈ బాలుడెవరో?



దోర్నాల పోలీసు స్టేషన్‌లో ఉన్న బాలుడు

ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడు బుధవారం ప్రకాశం జిల్లా దోర్నాలలో ఒంటరిగా తిరుగుతూ కనిపించాడు. బాలుడు ఏడుస్తు ఉండడం ఒంటరిగా ఉండడం గమనించిన కొందరు అతన్ని విచారించి తప్పిపోయినట్లుగా గుర్తించి స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆరా తీయగా.. తన పేరు నరసింహ అని, తండ్రి పేరు మధు అని, తమది నంద్యాల జిల్లా ఆత్మకూరు అని చెబుతున్నాడు. బాలుడిని గుర్తించిన వారు తల్లిదండ్రులకు సమాచారమిచ్చి తమ వద్ద ఉన్న బాలున్ని తీసుకెళ్లాలని దోర్నాల పోలీసులు కోరుతున్నారు.

– ఆత్మకూరురూరల్

6న ఏఐబీఈ మోడల్ టెస్ట్

కర్నూలు: కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 6న భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఏఐబీఈ 20వ మోడల్ టెస్టుకు ఏర్పాట్లు చేసినట్లు భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, కోశాధికారి దస్తగిరి, సహాయ కార్యదర్శి షఫిలు బుధవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. లా పూర్తి చేసుకుని ప్రాక్టీసు రావడానికి ఏఐబీఈ పరీక్ష పాసైన తర్వాత ప్రాక్టీస్ కోసం మోడల్ టెస్టు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, వివరాలకు 98854 71917, 93938 22654, 99083 77745 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.